# ఖండిత

**వి. ప్రతిమ**

**అరెరెc**

**అదేవిటేc? రోజా!**

**గులాబీ పువ్వు కాలి పోతోంది**

**మంటలు...మంటలు..**

**తొలిసంధ్యలో తూరుపువాకిలి తెరవగానే ముంగిట్లో విరిసి నవ్వులు చిందించే రోజా భస్మ మవుతోంది...**

కళ్ళల్లో నుండి నిప్పులు రాలుతూ.. కళ్ళు అగ్నిగోళాల్లా మండుతున్నాయి.

నోట్లో నుండి నాలుకలా బయటికొస్తూ మంట...

అరచేతుల్లో నుండి అగ్నికణాల్ని ఎర్రగన్నేరు పువ్వుల్లా వెదజల్లుతున్నట్లు మంట...

ఛ...ఛ...రోజా కాదులే.. ఎవరో వేరే అమ్మాయి..

కాదు... కాదు ఆ డిసెంబరు కలరు చుడీదార్ మీద నువ్వు చేసిందే జర్దోసి వర్క్...నువ్వే నీ చేతుల్తో రాత్రింబవళ్ళు నిద్ర లేకుండా మొన్న పుట్టిన్రోజు పండక్కి కుట్టింది.. తన క్లాస్‌మేట్స్ అంతా ఆ వర్క్‌ని ఎంతగానో మెచ్చుకున్నారని నీతో వచ్చి చెప్పింది రోజీయే.. మరెవరో కాదు రోజీయే..

''అయ్యో పిచ్చి తల్లీ.. ఏమయిందిరా నీకు?... ఇదేవిటీ యిలా కాలిపోతున్నావు? ఆక్రోశిస్తోంది నీ మనసు.. గొంతు ఎండుకుపోతోంది.. నోటమాట రావడం లేదు..

''అరెc ఆ పక్కనే మందార..

ఏమిటీ.. ఏదో తాడును ముడేస్తోంది.. తాడుతో ఏమాడుతోందీ?

పక్కన అక్క మండిపోతూంటే ఈ పిల్లేంటీ ఏదో తాపీగా

కాదు.. కాదు.. అది ఉరితాడు.

''అదిగో ఫ్యానుకి బిగిస్తోంది.''


''ఏమయిందిరా మీ యిద్దరికీ...బంగారు తల్లులు.. జీవితమంతా నేనెంత దిగులుననుభవిస్తున్నా మీకుకావల్సిందల్లా చేశాను కదరా.. శ్రమకోర్చి...'' ఆవేదన సుళ్ళు తిరుగుతోంది నీలోలోపలే..

''అమ్మా'' మాటల్ని తట్టుకోలేక రోజా అరిచింది.

కాళ్ళకింది స్టూలుని నెట్టేస్తూ మందారా అరిచింది.

అత్యంత సుకుమారమయిన రోజా పువ్వు మంటల్లో మాడి మసయిపోయింది.

రాత్రిని కప్పేసిన వెండి జలతారు వంటి మందార తాడుకు వేళ్ళాడుతోంది.



అంతా అయిపోయింది.. అయ్యో ఇంక నువ్వు బతకడమెందుకు?...

అసలు యింకా నువ్వు బతికేవున్నావా?... ఎక్కడ తేలుతున్నావు?

అచేతనలో నుండి చేతనలోకి ప్రవహిస్తే యిది మరింత హింసాత్మకమైన స్థితి...అరిచేతుల్లో నీ మనసుని ఎవరో పిసికేస్తున్నట్లుగా.. గుండెల్లో ఏదో పట్టేసినట్లుగా దారుణమైన బాధ...

మానసిక బాధని ప్రకోపిస్తూ శారీరకమైన బాధ...

ఎదుర్రొమ్ములోనుండి ఎడమ చేతి మీదుగా పాకుతోంది.

కల.. పూర్తిగా కరిగిపోయింది.. నీ కలలన్నీ కూడ ఒక్కొక్కటీ కరిగిపోయాయి.. చివరికి చివరి కల కూడా..

***

అదే యిల్లు.. అదే గేటు.. కాంపౌండు బయటికి విస్తరించి తెల్లగా విరగబూసిన నందివర్ధనం.. అవే కనకాంబరం మొక్కలు.. అవే గులాబీ పొదలు పసుపు... ఎరుపు... తెలుపు కొన్ని అరబూసి..మరి కొన్ని విరబూసి గేటువద్దనుండి యింటి గుమ్మందాకా బాటకి రెండువైపులా నువ్వు నాటిన పసుపు ఆకుల క్రోటను మొక్కలూ.. ఆ మూలనున్న ఒకే ఒక్క చేమంతిపొద.. పసుపుపచ్చని తెల్లని చిట్టి చేమంతులతో కిలకిల లాడుతోంది... వరండాలో నువ్వు తగిలించిన చిన్న ఛెయిమ్స్ గాలికి కదలాడుతూ గంటలు మోగిస్తూ వచ్చినవాళ్ళకి ఆహ్వానం పలుకుతూనే వుంది..

ఆ మొక్కల్లోనుండి నడుస్తూంటే నీ అడుగులు తడబడుతున్నాయి.. ఇదే గులాబీ పొదల్లో నీ ఆలోచనలు ఊపిరి పోసుకున్నాయి.. విహంగాల్లా ఎగిరాయి.. ఇంటిలోపలి నీ ఒత్తిడంతా ఈ గులాబి పొదల్లో ఆవిరయ్యేది... నీ స్ట్రెస్‌కి యిది ఒక వెలుపలి దారిలా పనిచేసేది...

ఎన్ని సాయంత్రాలు.. ఎన్ని అర్ధరాత్రుళ్ళు నువ్వీ గులాబీలతో కలిసి గడిపావే.. ఎన్నెన్ని కష్టాలని కలబోసుకున్నావు.. ఎన్ని నిర్లక్ష్యాలని నీళ్ళతో పాటుగా కలిపి వీటిపాదుల్లోకి వదిలావు.. నీకు.. నీ ఆలోచనలకు ఒక స్వరూపాన్నిచ్చింది ఈ మొక్కలే కదా.. నీ లోలోపలి నుండి తొలిపాట ఉబికి వచ్చిందీ.. తొలి కవిత ఊపిరిపోసుకుందీ యిచ్చటనే కదా..

మరేంటీ? యిప్పుడది చాల కొత్తగా...రంగులు మారినట్లుగా పగలే చిక్కటి చీకటి పాకుతున్నట్లుగా.. అన్ని రంగుల గులాబీలూ నల్లరంగులోకి పరావర్తనం చెందినట్లుగా..

అది దుఃఖమో, కోపమో, ఆవేశమో, వ్యగ్రతో.. ఆత్మని దహించివేసే ఒక మహాగ్ని ఏదో నీలో రగులుతోంది..

ఒక ఘోరప్రమాదం జరిగిపోయాక ఎదురయిన దృశ్యంలా వుందా ఉదయం.. కొంత ప్రశాంతత చిక్కితే నీ లోపల పొంగేది దుఃఖమో, అవమానమో, ఆనందమో పోల్చి చూసుకోవాలనుకుంటున్నావు.. నీకా అవకాశమే చిక్కడం లేదు..

***

మొదలవడం మాత్రం అంతా బాగానే సవ్యంగా మొదలవుతుంది..

ముగింపు మాత్రమే ఏదీ సవ్యంగా వుండదు.. పెళ్ళి పుస్తకం.. అప్పుడే కొన్ని ఖరీదయిన ఆల్బమ్‌లా నిగనిగలాడుతూ గొప్పగానే వుంటుంది.. లోపల అంతా ముఖంలేని ఫోటోలు.. డొల్ల.. డొల్ల కుళ్ళిన కోడిగుడ్డు కంపు.. బయటున్న వాళ్ళకి లోపలికెళ్ళాలనీ.. లోపలున్న వాళ్ళకి పరిగెత్తుకుంటూ బయటికి రావాలన్న తపన..

మూసేసేదాకా అంతా రహస్యం..

దిగులు, బాధ, కన్నీళ్ళు, అణిచివేత అంతా గోప్యమే...అన్నీ దాచేసుకోవాల్సిందే.. మింగుడు పడదు.. కక్కనివ్వదు.. గాయం సలపరిస్తూనే వుంటుంది.. పెదవుల మీద చిరునవ్వు చెరగదు.. కూడదు..

లేపనం ఉండదు.. మందయినా సరే... ఎవరికీ తెలీకుండా మింగాల్సిందే..అంతా గోప్యం..

అప్రకటిత ఆగ్రహాలూ, నిష్కారణ నిష్ఠూరాలూ, జీవితపర్యంత నిర్లక్ష్యాలూ, కారణంలేని క్రౌర్యం.. నువ్వు రోజూ ఎదుర్కొనే పరమానంద క్షణాలు.. అతడు విధించిన ధర్మాల్ని తప్పకుండా.. అతడి సానుభూతి పరిగెలేరుకుంటూ ఒక అలవాటు సంసారాన్ని లాగుతూ....

నీ ఆశలూ, ఆశయాలూ, ఆత్మగౌరవాలూ అన్నీ ఆయన భర్తతనం ముందు బలాదూరయిపోయాయి.. ఒంగి, ఒదిగి, నక్కినక్కి వుండడాన్ని సులువుగానే ఒంట పట్టించుకున్నావు.. వెలుపలి వ్యక్తులందరితోనూ ఎంతో మర్యాదగా ఆనందంగా, ఓపిగ్గా మాట్లాడే వ్యక్తి యింట్లో మాత్రం చెప్పలేనంత గంభీరంగా వుంటాడు.. అతడి కనుబొమలెప్పుడూ ముడిపడేవుంటాయి.. చాలా మామూలు మాటల్ని కూడ రుద్రస్వరంతోనే చెప్తాడతడు.. రోజంతటిలో నీతో ఒక్క మాట మాట్లాడితే ఎక్కువే.. నీ అంతట నువ్వు మాట్లాడాలని ప్రయత్నించినా విసుక్కునో, గదమాయించో మళ్ళీ నువ్వు నోరు తెరవకుండా నొక్కేస్తాడు..

అసలు మీ యిద్దరి ఆలోచనలూ, మీ స్పందనలూ, అసలు మీరు మాట్లాడుకునే మాటలూ.. మాట్లాడదలుచుకునే క్షేత్రాలూ కూడ పరస్పరం వేరువేరుగా వుంటాయి.. మీ యిద్దరి మధ్యా రెండు విడివిడి ప్రపంచాల భావన.. చివరాఖరికి నీకు నువ్వు మిగలకుండానే పొయ్యావు.

కొన్నాళ్ళపాటు పిల్లలతోడిదే ప్రపంచమయినప్పటికీ.. వాళ్ళు కొంత ఎదిగి దూరంగా వాళ్ళ చదువుల్లో వాళ్ళు యిమిడిపోయాక.. అప్పుడు నీ చుట్టూ కొంత సందడిని సృష్టించుకోవల్సిన అవసరాన్ని నువు గుర్తించావు.. పాటనీకు ప్రాణమైంది.. ఏళ్ళతరబడి నీ స్వరపేటికను నొక్కిదాచుకున్న కన్నీళ్ళతో నీ గుండెనిండి ఒలికిపోవడానికి సిద్ధంగా వున్న తరుణంలో నీకో వెలుపలి ద్వారం దొరికినట్టయింది.. పాటతో స్నేహం ఒక కొత్త ప్రపంచానికి దారులు తెరిచింది. పుస్తకాలు నీకు అత్యంత ప్రియమైన నేస్తాలయ్యాయి..

కవిత నీకు ప్రాణవాయువయిపోయింది.. క్లాసిక్స్‌తోపాటు యివ్వాల్టి ఆధునిక కవులు, రచయితలు అంతా నీకు ప్రియమైన వ్యక్తులయిపోయారు. వారి కవిత్వం చదూతుంటే మనసు విశాలమైపోయి వింతహాయికలిగేది..

చదువుతూ, చదువుతూ నీ కరిగిపోయిన కలలన్నింటినీ ఆ ప్రపంచంలో పోగు చేసుకోవడం మొదలుపెట్టావు....

అర్థంకాని చిక్కుముడులన్నీ వాటంతటవే విడిపోతున్నట్లుగా వుండేది.. నీకు.. నువ్వు ప్రతిరోజూ చూసే మామూలు సంఘటనలూ, మనుషులూ వెనుక కొత్త అర్థాలేవో గోచరించేవి..

చిన్నప్పట్నుండీ నీలో లోపల అంతర్గతంగా దాగివుండిపోయిన సాహిత్యాభిలాష యిప్పుడీ యిరుకులో నుండి విజృంభించడం మొదలుపెట్టింది. నీ రోజూవారీ ఒత్తిడికి భిన్నమైన ఏవేవో ఆలోచనా తరంగాలు నిన్ను చుట్టుముట్టేవి.. అవి నీ హృదయాన్ని తాకుతూ, విడిపోతూ.. విడిపోతూ..తాకుతూ.. ఆ అద్భుత ఔత్సాహిక శక్తితోనే.. ఆ తన్మయావస్థలోనే.. ఆ అధ్యయనంలో నుండే తొలిసారిగా ఒకపాట.. ప్రేమ కవిత వ్రాశావు.

ఎన్నడో మరిచిపోయిన చల్లని సాయంత్రాలూ...పొగడపూల పరిమళాలూ...బోగన్‌విల్లా,

నీ ఆశలూ, ఆశయాలూ, ఆత్మగౌరవాలూ అన్నీ ఆయన భర్తతనం ముందు బలాదూరయిపోయాయి.. ఒంగి, ఒదిగి, నక్కినక్కి వుండడాన్ని సులువుగానే ఒంట పట్టించుకున్నావు.. వెలుపలి వ్యక్తులందరితోనూ ఎంతో మర్యాదగా ఆనం దంగా, ఓపిగ్గా మాట్లాడే వ్యక్తి యింట్లో మాత్రం చెప్పలేనంత గంభీరంగా వుంటాడు..

మజెంతా.. పసుపూ..తెలుపూ రంగులు అన్నీ నీకు మళ్ళీ జ్ఞప్తికొస్తున్నాయి..

వాడిపోయిన పూలతోట మళ్ళీ చిగురిస్తున్నట్లు.. మళ్ళీ తడి.. ఆవిడెవరో అన్నట్టు బతుకుటీసుకలో పారేసుకుని దొరికించుకున్న ఆశల పూసల వరుసులా సాహిత్యం నిన్ను చేయి పట్టుకుని నడిపించ సాగింది.. చెరిగిపోయిన కొన్ని వెలుగు రేకల్ని రాల్చడం మొదలుపెట్టింది.. కొత్త ఉద్వేగం..

నీలోలోపలి ఈ కొత్త స్పందనలూ, దాచుకోలేని ఉత్సాహం యింట్లోవాళ్ళకీ, బయటివాళ్ళకీ కూడ వింతగా వుండేది.. నీ లేలేత ధైర్యం, ఆనందం వాళ్ళకి మింగుడుపడేది కాదు.. కానీ నిన్ను ఏమని శాసించగలరు?

అలా పాటలోనుండి.. పాడుకుంటూ..పాడుకుంటూ ఎప్పుడో మళ్ళీ ఒకపాట వ్రాశావు... పాట.. ప్రేమకవితా కొన్నాళ్ళతర్వాత చూసుకుంటే చాల అబ్సర్డ్‌గా కనిపించాయి.. చించేశావు.. ఏదో మథన...

నీ ఈ కొత్త సాహితీప్రపంచాన్ని పంచుకోవడానికి నీకో మనిషి కావాలి.. నీవు..వ్రాసిన కవితలు, నీ అభిప్రాయాలూ పంచుకోవడానికో వ్యక్తి కావాలి..నీ మస్తిష్కపుదారుల్లో వెనక్కి నడుచుకుంటూ, నడుచుకుంటూ జీవరసమున్నా రోజుల్లోకి వెళితే.. రాలిపోయిన పొగడపూలన్నింటినీ తిరిగి ఏరు




కుంటూ.. జారవిడుచుకున్న ఆత్మగౌరవ కవచాల్ని తగిలించుకుంటూ.. వెదుకులాడుతూ తళుక్కున మెరిశాడతడు నీ దృష్టిపథంలో...

ఆగకసాగే పాటవంటి అతడి స్నేహం..సంగీత సాహిత్యాలపట్ల అతడికున్న ప్రేమ... సమాజం పట్ల అతడికున్న అక్కర.. అసమానతలపట్ల ఆవేదన.. అసలతడితో మాట్లాడగలగడమే ఒక చదువు.. నీ చైతన్య స్రవంతిలో ప్రతి అనుభూతినీ పంచుకున్న స్నేహశీలి అతడు..నువ్వు మళ్ళీ వ్రాసిన కవితని అతడి ఆచూకీని తవ్వి పావురాయిని చేసి వొదిలావు.. పావురాళ్ళు ఎగురుతున్నాయి.

పాటలు, కవితలు, పద్యాలుగా..పద్యం పువ్వుగానూ, నదిగానూ, పక్షిగానూ, ఆకాశంగానూ, భూమిగానూ, జనంగానూ పరివర్తనం చెందింది.

అతడొక జ్ఞానపదార్థం..అతడొక అనాది పద్యం...

ఈ విస్తృత ప్రపంచం నీకు ఆనందాన్నీ, ఊరటనీ యివ్వసాగింది. 'అయ్యో యింత గొప్ప ప్రపంచాన్ని యిన్నాళ్ళూ ఎలా పోగొట్టుకున్నాను' అన్పించేది నీకు.. కాలు బయటపెట్టేందుకు...దగ్గరలో జరుగుతోన్న చిన్న చిన్న సభలకీ, సమావేశాలకీ హాజరుకావడానికి కుటుబంతో పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది నీకు...కొలవడానికి వీలుపడని నదిలా కాలం ప్రవహిస్తోంది.

***

కురిసి వెలిసిన వాననంటించుకున్న కిటికీ కమ్ములు వరుసగా పేర్చుకున్న ముత్యాల్ని ఒక్కొక్కటీ కిందకు వొదులుతున్నాయి..

దిగులు మేఘాల్ని చూస్తూ వేగంగా దూసుకువెళ్తోంది రైలు...బయటినుండి ఝివ్వున వస్తూన్న చలిగాలినీ, గత రెండు రోజులుగా గుండెల్లో దాచుకున్న అనుభూతుల వెచ్చదనాన్నీ ఒకేసారి అనుభవంలోకి తెచ్చుకునేదానివే కానీ.. వాతావరణంలో ఏదో మార్పు.. మూడు రోజుల క్రితం యిదే రైల్లో ముందుకి ప్రయాణిస్తున్నపుడు ఎంత ఆనందం.. ఎంత కేరింత... ఎంత ఉత్సాహం..

ఆదిత్య, నువ్వు అయిదారేళ్ళ పాపలయి పోయి నవ్వులు, మాటలు, పాటలు కేరింతలూ.. ఒక రి తర్వాత మరొకరు పోటీలుపడి మీరిరువురూపాటలు పాడుతూంటే ఆ రైలు భోగీ అంతానిశ్చలన చిత్రమైపోయింది.

ఏవేవో సంగతులూ, ఎప్పటెప్పడవో అనుభవాలూ, జ్ఞాపకాలూ స్కూల్‌మేట్స్ గురించీ, సంగీతాన్ని గురించీ, సంగీతం మేష్టారి తెల్లవారు ఝూము ప్రాక్టీసు గురించీ...సాహిత్యాన్ని గురించీ, చిన్నప్పుడు మీరు క్రమం తప్పకుండా చదివే సీరియల్సూ..వచ్చేవారం పత్రికకోసం అతృతగా ఎదురుచూడ్డం యిలా ఏవేవో విషయాలు ఎంత సరదాగా కలబోసుకున్నారు... మీరు వెళ్తూన్న సాహిత్య సభగురించీ.. అక్కడికి రాబోయే అనేక మంది లబ్ధప్రతిష్టులైన రచయితల గురించీ, వారి రచనల గురించీ ఎన్నెన్ని ఆసక్తికరమైన విషయాలు చెప్పాడు ఆదిత్య నీకు. ఆ ప్రయాణం రెండు సుమధురమైన గాత్రాలు కలగలిపిన అద్భుతమైన పాటలాగే ముందుకు సాగింది.

అసలిలా బయటికెళ్ళడం..అదీ కుటుంబ సభ్యులెవరూ ఆయన భర్తతనం నుండి పక్కకి జరిగి...యిలా సభలకి పంపడం నిజంగానే ఒక అద్భుతమైన విషయం..

నువ్వు పుట్టి పెరిగిన జిల్లానొదిలి...అక్కడక్కడే వుండిపోయిన చుట్టుపక్కల నొదిలి పెట్టి యింత దూరం రైలు ప్రయాణం బహుశా నీ జీవితంలో యిదే మొదటిసారి కావొచ్చు..

ఆదిత్య ప్రోత్సాహంతో నువ్వు యిల్లు వొదిలి యిన్ని జిల్లాలు దాటి వచ్చినందుకు నువ్వెంత మంది కొత్త కొత్త సాహితీకారుల్ని కలుసుకున్నావు..

పీడిత వర్గాల గురించి, ఆదివాసీల గురించీ, గిరిజనుల గురించీ, మత్స్యకారుల గురించీ.. యింకా ఆంధ్రదేశాన్ని ప్రపంచబ్యాంకుకు తాకట్టు పెడుతోన్న ప్రభుత్వాన్ని గురించీ..అమాయకుల రక్తపాతంతో అశాంతితో వేగిపోతోన్న దేశ ప్రజలగురించీ రకరకాల చీకటికోణాలకు కథారూపాలనిచ్చిన గొప్ప గొప్ప సాహితీకారులూ...

తమ అస్థిత్వాలను గురించి ప్రశ్నించిన స్త్రీలు...

పితృస్వామ్యం ఏర్పరచిన పరిధులను, నమూనాలను ఛేదించి తమవైన అనుభవాల గురించి మాట్లాడుతూన్న స్త్రీలు....

తాము వ్రాస్తున్నప్పుడు ఎదురయ్యే సెన్సార్‌షిప్‌ని గూర్చి వివరిస్తూ కవిత్వంలో, పాటలో, కథలలో తమ అణచివేత వెనుకనున్న రాజకీయాలని గురించి నిలదీసిన స్త్రీలు..

స్త్రీలను ప్రత్యేకతలు, ప్రత్యేక అవసరాలు వున్న గ్రూపుగా చూడటమూ యివ్వాల్టి రాజకీయ అవసరమనే దాన్ని గుర్తింపజేయటంలో విజయాన్ని సాధించిన స్త్రీలు..

అంతా ఒక్కచోట నిటారయిన వెన్నుపూసలతో నడుస్తూంటే, ఆత్మవిశ్వాస పూరితంగా మాట్లాడుతూంటే.. వాళ్ళందరినీ అలా ఒక్కచోట చూడగల్గడం.. నీకేంటో మరో కొత్తలోకంలో, కొత్త ప్రపంచంలో వున్నట్టుగా అన్పించింది..

అలాగే ఎనెన్నో లోతయిన సమాజ సంబంధిత కథలు వ్రాసిన రచయితల్నీ, కవులనీ, గ్రంథకారుల్నీ అక్కడ చూసి విభ్రమ చెందావు..

'మనకి ఎదురయ్యే సంఘటనలూ, కనిపించే జీవితమూ గురించి వ్రాసినంత తేలిగ్గా... దాని వెనుకనున్న పరిస్థితుల్నీ, ఎండని ఏడోచేపకున్న అనేకానేక కారణాల్నీ, రాజకీయాల్నీ, సమాజవిలువల్నీ మార్కెట్ మాయాజాలాన్ని పట్టుకోవడం అంత తేలిక్కాదంటాడో రచయిత.

ఇలా లోతుగా వెళ్ళి సమకాలీన సామాన్య జీవితాల్ని పట్టుకుని సాహిత్యంలో ప్రతిబింబింపచేసిన రచయితల్ని ఒక్కొక్కరినీ ఆదిత్య నీకు పరిచయం చేస్తోంటే ఉద్వేగపడిపోయావు...అదే ఉద్వేగంతోనే 'జొన్నకంకి' నీకెంతో నచ్చిన జొన్నకంకి కథ వ్రాసిన మాచినేని చెయ్యిపట్టుకుని షేక్ హ్యాండిచ్చావు.. 'డప్పు' కవిత వ్రాసిన జాతీయ స్థాయిలో మొదటి బహుమతి పొందిన షరీఫ్‌తో అతడి కవిత లోతుల్ని తర్కించి మాట్లాడావు.. అందరితోనూ అరమరికలు లేకుండా నిన్ను నువ్వు పరిచయం చేసుకున్నావు.. నువు వ్రాసిన ఒకటి రెండు కవితల్ని యువకవులు గుర్తించి మాట్లాడుతుంటే సంబరపడిపోయావు..

ఈ రెండు రోజులూ నేను స్త్రీని, నేరు బానిసని అన్న విషయమే నీకు గుర్తురాలేదు.. ఇల్లూ వాకిలీ, మొగుడూ, మొత్తుకోళ్ళూ, పిల్లాపీచూ, చుట్టాలూ పక్కాలూ ఏదీ నీకు జ్ఞాపకం లేదు..

కలల శూన్యంలోకి తలకిందులుగా దూకుతోన్న గమ్యాన్ని పట్టుకోవడానికి పచ్చని చెట్లంట, పసితనపు గట్లంట.. ఎగురుతోన్న పాలపిట్టలా పరిగెత్తావు...

ఎప్పుడో మూసుకుపోయిన నీ కంఠస్వరం నెమలి పింఛంలా విచ్చుకోవడం మొదలుపెట్టింది...

'మనసున మల్లెల మాలలూగెనే...

'హృదయమా పొగులుమా.. భావవేగాల దారుల్లసాగీ...''

''రెల్లుపూలా పానుపుపైనా పరిచినాదే

వెన్నెలా...''

ఇలా ఒకదాని వెంట మరొకటి గీతాలు నీ స్వర పేటికనుండి మధుర మంజులంగా జాలు వారసాగాయి.. అంతా ఒక్కొక్కరే క్రమంగా నీ చుట్టూ చేరి ఆ గానాన్ని ఆస్వాదిస్తుంటే.. ఎంతోమంది కథకులూ, కవులూ నిన్ను అభిమానంగా అభినందిస్తుంటే నీ హృదయం పొంగిపోయింది..

ఎన్నో వందల కాంతి సంవత్సరాల తరువాత నీలోని చిన్ని ప్రజ్ఞను అభినందించే మనుషులు దొరికారనీ, నీకు మనసు విప్పి మాట్లాడే అవకాశం కలిగిందనీ మురిసిపోయావు.. హృదయపు ముంగిట కాంతిరేకలు పరుచుకుని విస్తరిస్తున్నట్లుగా సంబర పడిపోయావు..

నీ జీవితంలో ఏ ఆనందమయినా సరే క్షణ భంగురమేనన్న విషయం అతి తక్కువ సమయంలోనే అర్థమయిపోయింది నీకు..

మూడు రోజుల క్రితం యిదే రైల్లో ఒక పాటలా ప్రవహించిన ప్రయాణం యివ్వాళ మౌన సముద్రపు లోతుల్ని కొలుస్తోంది..

''ఏమయింది వీళ్ళకి?'' అని ఆశ్చర్యపోయావు నువ్వు...

తిరుగు ప్రయాణంలో మీతో కలిసి వెనక్కి ప్రయాణిస్తోన్న మీ పక్క జిల్లా రచయిత్రి మాధవి ఎందుకో తెలీదు గానీ ఒకింత సీరియస్‌గా వుంది.. ఆదిత్య కూడ మునుపటిలా లేడు.. అందరి నడుమా ఏవో తెరలు.. ఆ పలచటివో.. మందమైనవో తెరలని తొలగించాలని అన్పించినా నీ చేయి ముందుకు సాగడం లేదు..

నిన్ను ఎక్కువసేపు నీ ఆలోచనలలో ఉక్కిరిబిక్కిరి చేయడం యిష్టంలేనట్లుగా అతడు మౌనాన్ని ఛేదించాడు.

''నువు చాలా జాగ్రత్తగా వుండాలమ్మాయి'' అప్పుడే నలుగురికీ టీ పట్టుకొచ్చి అందించి తనూ కూర్చుంటూ అన్నాడు మాధవి భర్త హనుమంతరావు.. అతడు కూడ రచయితే.. అక్కడక్కడా కథలూ, కవితలూ సిద్ధాంత వ్యాసాలూ వ్రాస్తుంటాడు.

'టీ' ఎందుకో చేదుగా అన్పించింది నీకు.. అతడేం చెప్తున్నాడో అర్థం కావడం లేదు.. టీ తాగకుండానే కిటికీలో నుండి మెల్లిగా కిందికి జారవిడిచావు.. అప్పటికే నీ కళ్ళల్లో నీళ్ళు తిరిగినట్టున్నాయి..

నేరమేమిటో తెలీకుండా నేరస్థురాలిలా నిలబడాల్సిరావడం...

ఆదిత్య మౌనం నిన్ను మరింత బాధిస్తోంది..

నీ అనుమానాన్ని, అయోమయాన్నీ, అర్థంకానితనాన్నీ ఛేదిస్తూ

''ఇలాంటి చోట్లకి వచ్చినపుడు మనం చాలా జాగ్రత్తగా వుండాలి.. ఎవరితోనూ అతి చనువు పనికిరాదు..'' మధ్యమధ్యలో మాటలు మింగుతూ, సంకోచంగానే అయినా హితబోధ చేస్తోంది మాధవి..

దిగ్భ్రాంతి చెందావు నువ్వు.

ఇక్కడ 'మనం' అంటే 'స్త్రీలం' అని కాబోలు..

ఇలాటి చోట్లకి అంటే ఎలాటిచోట్లకి?

బయటి ప్రపంచంలో ఎలాగూ ప్రతీ క్షణం నేను స్త్రీని.. స్త్రీని అనుకుంటూ అతి జాగ్రత్తతో ఒదిగొదిగి భయం భయంగా వుండడం అలవాటు చేసుకున్నావు.. ఇదేదో అసామాన్య ప్రపంచం... ఇక్కడ లింగ బేధాలుండవు.. అంతా ఒకటే.. ఇక్కడెవరితోనూ అతి జాగ్రత్తలు వహించాల్సిన అవసరం లేదు.. పక్షుల్లా ఎగరొచ్చు అనే కదా అనుకున్నావు.. ఇక్కడ కూడా మనం స్త్రీలం అన్న విషయం అనుక్షణం గుర్తుంచుకోవల్సిందేనా?

వీళ్ళేమిటి నిన్నిలా మందలిస్తున్నారు?

వీళ్ళేమిటి నీకిలా సుద్దులు చెప్తున్నారు.. ఆదిత్య అభిప్రాయం కూడా యిదేనా?...


అసలు నువ్వేం చేశావని?

ఎంత ఆలోచించినా నువ్వు చేసిన తప్పేమిటో అర్థంకావడం లేదు నీకు.. 'వీళ్ళు అంటున్నదాన్ని బట్టి తనెవరితోనయినా హద్దులు అతిక్రమించి ప్రవర్తించిందా?' అనుకున్నావు. ఆదిత్యతో నువు మొదట్నుండీ చనువుగానే వున్నావు.. ఇప్పుడు మరి కొత్తగా చేసిన తప్పేమిటి?..

ఓహ్.. నిన్న సాయంత్రం బీచ్ ఒడ్డుకు వెళ్ళినపుడు నువు షరీఫ్‌తో సన్నిహితంగా కూర్చుని అతడి 'డప్పు' కవిత గురించి చాలా లోతుగా చర్చకు దిగావు. మరెన్నో కవితాత్మకమైన విషయాలని యిరువురూ మాట్లాడుకున్నారు...

అతడేదో గొప్ప నిస్పృహలోనూ, నిరాశలోనూ వున్నట్లుగా నీ జీవితానుభవం చెప్పింది.. దాంతో అనేకానేక జీవితాల్లోని మిట్టపల్లాలనీ, కష్టనష్టాలనీ సార్వజనీనంగా అతడి కళ్ళముందు ఆవిష్కరించజేశావు...చాలాసేపు మాట్లాడాక, నువ్వు ఎన్నెన్నో జీవితాలని గురించి చెప్పాక అతడా సూయిసయిడల్ మూడ్‌లోనుండి, హత్యా ప్రయత్నాల నుండీ ... బయటపడ్డట్టుగానే నీకన్పించింది.. అతడేమన్నాడు?

చాలా కృతజ్ఞతలు చెప్తూ నీ చేయి పట్టుకుని వూపేశాడు,. ఇవే కాళ్ళనుకోండి అంటూ కళ్ళకద్దుకున్నాడు..సరిగ్గా యిటువంటి డిప్రెషన్లో నీవంటి స్నేహమయి అతడికి తారసపడినందుకు ఆనందపడిపోయాడు. నీలో నువ్వు ఈ ప్రయాణం సార్థకమ



## మెస్మరిజం

మోడలింగ్ నుంచి సిన్మాల్లోకి వచ్చిన మరో కొత్త గుమ్మ సుష్మారెడ్డి. సుష్మ నవ్వులో ఒక మెస్మరిజం వుంది. అదే తనని విజె టెస్ట్‌లో గెలిపించింది అంటుంది. చాక్లెట్ ఎలా దొరికిందంటే- అంతా డైరెక్టర్ మహిమ అంటూ మురిసిపోతుంది. ఎరిన్ బ్రోకివిచ్ లో జూలియా రాబర్ట్‌లా నటించడం ఛాలెంజ్‌గా తీసుకున్నానంటోంది. వినాలే కానీ...కో హీరోల మీద బోలెడు సం'గతులు' చెప్తుంది. శృంగారపురుషుడుగా ఇర్ఫాన్‌ని వేలితో చూపిస్తుంది. ఇమ్రాన్ మాటకొస్తే - కష్టపడి పనిచేస్తాడంటూ కితాబిస్తుంది. ఇంతకీ తనకిష్టమైన మిస్టర్ రైట్ ఎవరంటే- వెతికి పట్టుకునే టైమెక్కడ అంటుంది. అయితే గియితే ఆ మిస్టర్ ఆర్- అభిషేక్ అయితే బావుణ్ను అనే ఆశ మాత్రం లేకపోలేదు ఈ అమ్మడికి. అతనితో కల్సి నటించడం తన డ్రీమ్ అంటోంది. కల్లోకి వచ్చినవాడు-మనసులోకిమాత్రం రాకుండా వుంటాడా? చూద్దాం.

యిందని గర్వపడ్డావు కూడా..

అయితే యిదంతా నీ చుట్టూ వున్న వాళ్ళు యింత లోతుగా గమనించేస్తున్నారనీ.. నీ కంటే ఎంతో చిన్నవాడైన షరీఫ్‌కీ, నీకూ మధ్య కాని సంబంధాలు అంటగట్టేసుకుంటున్నారనీ.. నువ్వు ఇక్కడ కూడ స్త్రీవేననీ వూహించలేకపోయావు..

ఏమంటోంది మాధవి?

"స్త్రీలు లైంగిక వివక్ష కారణంగా ఎలా తక్కువగా చూడబడుతున్నారో వివరిస్తే.. ప్రశ్నిస్తూ వచ్చిన స్త్రీ ధిక్కార స్వరాన్ని గురించి నిన్న వేదిక మీద ఢంకా భజాయించి మాట్లాడిన రచయిత్రి మాధవీదేవి ఏమంటోంది?

"కేవలం స్త్రీలయినందువల్ల, మన శరీర ధర్మాల్ని గురించి మనం చెప్పుకున్నందువల్ల పురుషులెలా అవహేళన చేస్తే విమర్శకు పెట్టాలి అన్నవిషయాన్ని ఎత్తి చూపి, సభంతటి చేతా చప్పట్లు కొట్టించుకున్న మాధవీ దేవి యిప్పుడేమంటోంది?

"ఇలాటి చోట్లకి వచ్చినపుడు మనం స్త్రీలం చాలా జాగ్రత్తగా వుండాలి." అంటోంది... ఆమె

ఆదిత్య పొడవాటి ముఖం వెనుకనున్న భావాలేవీ నీకు మింగుడు పడ్డంలేదు.. ఏమిటతడి మౌనానికర్థం.. వీళ్ల అంటోన్న మాటల్ని సమర్థిస్తున్నట్టా? లేక నిన్ను వాళ్ళలా అంటున్నందుకు లోలోపల బాధ పడ్తున్నట్టా? ... ఎన్నెన్ని తెలివితేటలూ, జ్ఞాన చైతన్యమూ వున్న వ్యక్తి వాళ్ళనెందుకు ఖండించలేకపోతున్నాడు?

భర్త హనుమంతరావు చాలా సంతోషించినట్టే వున్నాడు. అయితే మాధవీదేవి చెప్తున్నది కూడా ఒక విధంగా సరైందేనేమొ.. "వీళ్ళంతా వ్రాయడం వరకే రచయితలు." అన్న విషయం ఆవిడకి బాగానే అనుభవమున్నట్లుంది జీవితంలో...

నిన్న ప్రముఖ స్త్రీవాద రచయిత్రి 'సమత' మాట్లాడుతూ స్త్రీలు వ్రాస్తున్నపుడు ఎంత అదుపు వుంటుందో, వాళ్ళమీద ఎన్నెన్ని నిషేధాజ్ఞలు అమలవుతాయో వివిధ భాషల రచయిత్రులు సొంత అనుభవాలను ఆమె సంఘటనలు సంఘటనలుగా వివరిస్తోన్నపుడు నీ గుండె గొంతులోకొచ్చినట్టయింది.. ఎక్కడయినా, ఏ ప్రాంతంలోనయినా సరే మొగుడనేవాడు తన భార్య తనకంటే ఆధిక్యత.. అందులో మేధోపరమయిన ఆధిక్యతని సహించలేడేమో.. లేడు అన్న విషయం నీకు ఆశ్చర్యాన్ని కలిగించింది..

ఏ కాలంలోనయినా, ఏ రాజ్యంలోనయినా, ఏ వర్గంలోనయినా సరే.. మౌలికమైన మార్పును కోరే భావాలు ప్రమాదకరమైనవిగా అధికార వర్గాల చేత పరిగణింపబడతాయి' అన్నదా రచయిత్రి.

ఆ మొత్తం ఆమె ఉపన్యాసమంతా యింతలోనే నీకు అనుభవంలోకి వస్తుందని నువ్వు అనుకోలేదు..

హనుమంతరావు జ్ఞానవృద్ధుడిలా నీకు సలహా లిస్తూనే వున్నాడు నిరాఘాటంగా.. ఏయో చోట్ల ఎవరెవరు స్త్రీలు కళల పేరులో ఎలా ఎక్స్‌ప్లాయిట్ చేయబడ్డారో సవివరంగా చెప్తున్నాడతడు.. అలా నీకు బోధ చేయడంలో అతడెంతో ఉత్సుకతనీ, ఆత్మసంతృప్తినీ పొందుతున్నట్లుగా వున్నాడు..

ఆదిత్య, నువ్వు కలిసి పాటలు పాడడం వెనుక కూడ దేన్నో గుర్తిస్తున్నట్లున్నారు వాళ్ళు...

నువ్వు తలే దించుకున్నావో, మనసే దించుకున్నావో అర్థంకానట్లుగా వున్నావు...

ఆదిత్య పొడవాటి ముఖం వెనుకనున్న భావాలేవీ నీకు మింగుడు పడ్డంలేదు.. ఏమిటతడి మౌనానికర్థం.. వీళ్ల అంటోన్న మాటల్ని సమర్థిస్తున్నట్టా? లేక నిన్ను వాళ్ళలా అంటున్నందుకు లోలోపల బాధ పడ్తున్నట్టా? ... ఎన్నెన్ని తెలివితేటలూ, జ్ఞాన చైతన్యమూ వున్న వ్యక్తి వాళ్ళనెందుకు ఖండించలేకపోతున్నాడు?

దిగులు రహదారుల నీడల్ని చూస్తూ ముందుకో, వెనక్కో తెలీనట్లుగా సాగిపోతోంది రైలు...

అవమానంతో ఎర్రబడిన ముఖంలో విభ్రమతో మిగిలావు నువ్వు. శరీరంలోలోపల ఏదో నిప్పుఅంటుకున్నట్లుగా బాధ.. హఠాత్తుగా ఏదయినా విధ్వంసం జరిగి ఈ రైలు కూలిపోతే బావుండునన్పించింది నీకు...

కుహనా సంస్కారపు కళ్ళజోళ్ళని తొడుక్కుని అడుగడుగునా నువ్వు ఆడదానివన్న బతుకు కాళ్ళకడ్డం పడేస్తూ ఫ్రీ ఈ అసమాన్యులకన్నా యింట్లో వున్న ఆ సామాన్యుడే నయం.. కనీసం ముసుగు నన్నా కప్పుకోడు.. వ్యగ్రతతో నిండిపోయిన హృదయాన్ని అదుపులో పెట్టుకోవాలని వ్యర్థ ప్రయత్నం చేస్తూ.. మాటిమాటికీ గిర్రున తిరిగే కన్నీటి సముద్రాల్లో ఈదుతూ, ఆ రైలు ద్వీపం మీద నీ చుట్టూ పేరుకుపోయిన ఒంటరితనంతో కలిసి ఎలా యింటికొచ్చిపడ్డావో నీకే తెలీదు..

అదే కాంపౌండు.. అదే గులాబీలు.. అదే యిల్లు..

ఎక్కడో ఏదో మార్పు.. నీకాళ్ళు వొణుకుతున్నాయి..

స్వచ్ఛమైన తెల్లకాగితం వంటి నీ మనసు మీద ఏవేవో మరకలు.. మనసు కిటికీలో నుండి కొత్త కొత్త గమ్యాలేవో నిన్ను ఢీ కొడుతున్నాయి.. గాయం శరీరానికో, మనసుకో తెలీనంత బాధ..

మానుతున్న పుండేదో చీలి రక్తం మళ్ళీ జివ్వున చిమ్మినట్లుగా మంట.. ఏదో అయోమయం..

రెండురోజులేనని చెప్పి వెళ్ళి నాలుగురోజుల కొచ్చినందుకు ఏదో జరిగిపోయినట్లుగా దెప్పిపొడుస్తున్నాడు నీభర్త. ఒక్కసారి... ఒకరోజు రాత్రి అతడితో కాకుండా.. మరెక్కడయినా వుండిపోవాల్సి వస్తే.. మరెక్కడయినా పడుకున్నట్టయితే యిక శీలం పోయినట్లేనా?... అసలు స్త్రీ నోరు విప్పి చెప్పనట్టయితే, ఆమె శీలాన్ని అంచనా వేయగల్గడం ఎవరికి సాధ్యం?...తప్పు చేయడానికే అయితే నాలుగు జిల్లాలు దాటి వెళ్ళాలా?...

అసలే దుఃఖంతో నిండిపోయి వున్న నీ మనసు మీద గోళ్ళగాట్లు..

ఏడుపు నాపుకోవడం చాలా కష్టమయిపోయింది నీకు..

స్త్రీ దుఃఖ ప్రవాహానికే శక్తి వున్నట్టయితే అది ఏనాడో ఈ బూటకపు ప్రపంచాన్ని ముంచెత్తేసేదే..

నీ లోలోపలి శూన్యాలనీ.. అగాధాలనీ పూడ్చలేని వెలితి తాలూకూ కొస అంచులేవో మరణానికి అందుతున్నట్లుగా నీకు బతకాలన్పించడం లేదు..

అలాగని చచ్చిపోవడానికి వీలు లేదు... సమయం కాదు..చాలా పనులుండిపోయాయి.. బాధ్యతలూ మిగిలిపోయాయి.. నచ్చినా, నచ్చకపోయినా బతికి తీరాల్సిందే..

***

చిన్నారి రోజా మంటల్లో కాలిపోయింది..

ఉరితాడుకు వేళ్ళాడుతోన్న మందార మాయమైపోయింది..

కరిగిపోయిన కలలోని నిజానిజాలు రెండూ భేటీ పడుతున్నాయి.. దరికానని నావలా గదిలో అటు, ఇటు తిరుగుతూ.. పలకరింపు లేని జీవితాన్ని సమాయించుకుంటూ... స్థిమితం చిక్కని మనసును ఉగ్గబట్టుకుంటూ.. తెల్లారగట్ల బ్రాహ్మీ ముహూర్తంలో లేచి నీ వ్రాత కిటికీకి ఎదురుగా కూర్చున్నావు..

కొద్ది దూరంలో వున్న కొండమీది మంచు తరంగాలు కదిలి వీధి దీపపు కాంతుల్లోనుండి నీ వైపు తరలి వస్తున్నట్లుగా వుంది.. పక్కింట్లో క్యాసెట్లో నుండి పాత సినిమా పాటలేవో శ్రావ్యంగా, మంద్రస్వరంలో వచ్చి అలవోగ్గా నిన్ను తాకుతున్నాయి.. ఇంటిమీదుగా వాలివున్న మామిడి కొమ్మ మీది కోయిల అప్పుడే నిద్ర లేచినట్లు 'కుహుకుహు' రావాలు విన్పిస్తూ ప్రపంచానికి సుప్రభాతం పాడుతున్నట్లుగా వుంది..

ఇంకా పూర్తిగా విచ్చుకోని పసుపురంగు గులాబీ ఒకటి కదలాడి, కదలాడి నీతో మాట్లాడాలని నిక్కుతోంది..

హర్షాతిరేకంతో కిటికీకి ఆనుకుని వున్న రేరాణి నిన్ను స్పృశించింది... ఆ హృద్య వాతావరణంలో స్పందనలో నుండి బయటికురకాలని ఉబలాటపడుతోన్న కవితను కాగితం మీదికి చేర్చాలని మెల్లిగా కలం తీశావు నువ్వు...

చిత్రం.. దిగ్భ్రాంతి..

నీచేతి.. కుడి చేతి బొటన వ్రేలు.. చూపుడు వేలు రెండూ తొలగింపబడివున్నాయి..

ఆ అఖండ ఖండితాల లోలోపలినుండి అనంత జీవధారని వెతుకులాడుతూ నువ్వు...

నీ లోపలి నువ్వు.. నీ బయటి నువ్వు..

నీ బయటి నువ్వు...నీ లోపలి నువ్వు..

నీ సామాన్య.. అసామాన్య ప్రపంచాలు!...

★